సాక్షి

# హైదరాబాద్ మెట్రో దిక్సూచి మన్మోహన్ సింగే

## మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆర్థికవేత్తగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా, ప్రధానమంత్రిగా భారత దేశ ఆర్థిక పురోగతికి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎనలేని కృషి చేశారని హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు.ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. పీవీ నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ కలిసి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ద్వారా దేశంలో అధునాతన విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, జాతీయ రహదారులు, టెలీకమ్యూనికేషన్ తదితర రంగాల్లో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అభివృద్ధి చెందుతుండగా, మెట్రో రైల్ ప్రాజెక్టులు ఆర్థిక భారంతో కూడినవి కావడంతో ప్రపంచమంతటా నగరాల అవసరాల దృష్ట్యా వాటిని ప్రభుత్వ రంగ ప్రాజెక్టులుగానే నిర్మించేవారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో హైదరాబాద్ మెట్రోను ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి ప్రోద్బలంతో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతో తాము హైదరాబాద్ మెట్రోను పీపీపీ విధానంలో రూపొందించామని ఎన్వీఎస్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌గా రూ.1,458 కోట్ల వైబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను కూడా డాక్టర్ మన్మోహన్ సింగ్ సారథ్యంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. హైదరాబాద్‌లో సఫలమైన పీపీపీ బిడ్డింగ్ విధానంపై అహ్లువాలియాకు లేఖ ద్వారా వివరించగా, దానిపై మన్మోహన్ సింగ్ స్పందిస్తూ హైదరాబాద్ మెట్రో ఒక దిక్సూచిగా నిలుస్తుందని, దేశంలో ఇతర ప్రోజెక్టులు కూడా ఈ విధానాన్ని అనుసరించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. మేటాస్ వైఫల్యంతో అనేక మంది హైదరాబాద్ మెట్రోపై విమర్శలు గుప్పించినా , ఇదే సరైన విధానమని ఇదే పద్ధతిని కొనసాగిస్తూ అంతర్జాతీయ టెండర్లకు వెళ్లాలని మద్దతు ఇచ్చారన్నారు. ఆయన ప్రోద్బలం, మద్దతు, సహాయం లేకుండా ఈ రోజు ప్రపంచ చరిత్రలో ఒక అరుదైన పీపీపీ మెట్రో ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో అవతరించేది కాదని, వారికి హైదరాబాదీయులు ఎప్పటికీ రుణపడి ఉంటారని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు.